క్లుప్తంగా

'మానవత' సంస్థకు రూ.35 వేల విరాళం


విరాళం అందిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వుండవల్లి సుభాష్‌చంద్రబోస్

గోపాలపురం: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మొబైల్ మంచినీటి ట్యాంకు ఏర్పాటుకు మండలంలోని వాదాలకుంటకు చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యులు వుండవల్లి సుభాష్ చంద్రబోస్ శనివారం రూ 35 వేల నగదును మానవత స్వచ్ఛంద సంస్థ మండల సభ్యులకు అందజేశారు. మానవత సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ఏర్పడుతుండటంతో మొబైల్ ట్యాంకు ఏర్పాటుకు సన్నాహాలు చేసిన వెంటనే దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.అదే గ్రామానికి చెందిన గెడా జోగేంద్రప్రసాద్, వుండవల్లి రామకృష్ణ, కాకర్ల శ్రీరామ్, వుండవల్లి గాంధీ, ముళ్లపూడి జై శ్రీరామ్, జె. రాంబాబులు రూ 5 వేల చొప్పున మానవతా సంస్థకు విరాళంగా అందజేసినట్టు రాంబాబు వెల్లడించారు.

13న మెగా లోక్ అదాలత్

నిడదవోలు రూరల్: స్థానిక కోర్టులో మే నెల 13న నిర్వహించే మెగాలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాస్ అన్నారు. నిడదవోలు కోర్టు ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసుల్లో ఇరువర్గాల వారితో మాట్లాడి రాజీ పడేలా చూడాలని బార్ అసోసియేషన్ న్యాయవాదులకు, పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, కార్యదర్శి ఎం.మంగయ్య, సీనియర్ న్యాయవాది మెంటే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే పారదర్శకంగా జరగాలి


కొవ్వూరులో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న మంత్రి వనిత

కొవ్వూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపట్టిన భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని హోం మంత్రి తానేటి వనిత సూచించారు. పట్టణంలో శనివారం ప్రారంభమైన రీ సర్వేలో కీలకమైన డ్రోన్ సర్వేను మంత్రి వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కమిషనర్ బి. శ్రీకాంత్, పార్టీ మండల, పట్టణశాఖల గౌరవా ధ్యక్షులు గన్నమని వీరవెంకట్రాజు,నగళ్ల పాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు

గోపాలపురం: మండలంలోని గోపవరంలో యండపల్లి రమామణి, వెంకటరత్నం స్మారక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లోని విజేతలకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బహుమతులు అందజేశారు. ఆ సంస్థ కన్వీనర్, గోపవరం సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, నాయకుడు ఎస్‌కే వల్లీ, కమిటీ సభ్యుడు ముళ్ళపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ యండపల్లి హరికృష్ణ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శశి వేలివెన్ను' విజయభేరి


పి.జయ చరణ్, ఆర్‌వీఎస్ రామ వరుణ్, బి.అక్షయ్


జి.విశ్వతేజ

ఉండ్రాజవరం: శనివారం ప్రకటించిన జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో తమ విద్యార్థులు మరోసారి సత్తా చాటారని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. పి.జయచరణ్ 99.92 పర్సంటైల్, ఆర్‌వీఎస్ రామవరుణ్ 99.89, డీబీ అక్షయ్ 99.86, జి.విశ్వతేజ 99.82, ఎ.హేమంత్ సింధు 99.79, జె.నాగేంద్రకుమార్ 99.77, సీహెచ్ వెంకటసాయి 99.77 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే జీవీవీ సత్యకృష్ణ 99.73, పి.మోహిత్ సాయిసత్య 99.72, పి.గంగామనోహర్ 99.71, కె.మన్విత 99.67, బీవీ వీక్షిత్ 99.67 పర్సంటైల్ సాధించారని చెప్పారు. ఇక వి.ముఖేష్ 99.66, జి.మోక్షజ్ఞ 99.65, ఎస్.నరసింహ సమీర్‌కుమార్ 99.62, ఎం.ఉమామహేశ్వరరావు 99.61, డీఈఎస్ ఆదర్శ వర్మ 99.57, కె.చంద్రశేఖర్ 99.53, కె.రోహిత్‌కుమార్ 99.52, కె.నిహారిక 99.50 పర్సంటైల్ సాధించారన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను శశి విద్యాసంస్థల వైస్‌చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.


సమిశ్రగూడెం శివార్లలో నేలకొరిగిన అరటి తోట


నల్లజర్ల మండలం తూర్పుచోడవరంలో తడిసిన మొక్కజొన్న


దేవరపల్లి మండలం దుద్దుకూరులో తడిసిన ధాన్యం


ఎస్. ముప్పవరంలో తడిసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

ఈదురు గాలులు.. అన్నదాతల బేజారు

- అకాల వర్షంతో పంటలకు తీవ్ర నష్టం
- తడిసిపోయిన ధాన్యపు రాశులు
- దెబ్బతినఉద్యాన పంటలు
- ఆవేదన చెందుతున్న రైతులు


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఆరబెట్టిన ధాన్యం రాశుల్లోకి చేరిన వర్షపు నీరు

నిడదవోలు రూరల్: అకాల వర్షంతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులు, అకాల భారీ వర్షం సంభవించాయి. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కలవచర్లతో పాటు పలు గ్రామాల్లో రైతులు ఆర్ అండ్ బీ రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. అరటి తోటలు కూడా నేలవాలాయి. కంసాలిపాలెంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లు సరి చేస్తున్నారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఏఓ జి.సత్యనారాయణ, ఎంపీడీఓ టి.మూర్తిబాబు పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


గోపాలపురం మండలం కోమటికుంటలో నేలకొరిగిన అరటి తోట


నిడదవోలు- నరసాపురం ఆర్ అండ్ బీ రోడ్డుపై వర్షానికి తడిసిన ధాన్యపు రాశులు

ఉండ్రాజవరం: శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. మండల వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం పడింది. దాంతో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని, గోనె సంచుల్లో పట్టి కాపాడుకోనేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు.

దేవరపల్లి: ఈదురు గాలులతో కూడిన వర్షానికి మామిడి పంట దెబ్బతింది. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వారం వ్యవధిలో రెండు సార్లు అకాల వర్షాలు కురవడంతో ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం అమ్ముడుపోక ముందే మరొక సారి వర్షం కురిసిందని రైతులు తెలిపారు. మండలంలోని గౌరీపట్నం, దుద్దుకూరు, లక్ష్మీపురం, పల్లంట్ల, బంధపురం గ్రామాల్లో వర్షం కురిసింది. చెట్లకు ఉన్న కొద్దిపాటి మామిడి కాయలు ఈదురు గాలులకు రాలిపోయినట్టు రైతులు తెలిపారు.

గోపాలపురం: ఈదురుగాలులు, భారీ వర్షానికి ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అరటి, నిమ్మ, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. శనివారం సాయంత్ర వీచిన ఈదురుగాలులకు మండలంలోని గోపాలపురం, కోమటికుంట, జగన్నాథపురం, కొవ్వూరుపాడు, దొండపూడి గ్రామాల్లోని అరటితోటలు నేలకొరిగాయి. నిమ్మ చెట్ల మొదళ్లు బయటకు వచ్చాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురవడంతో చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి దెబ్బతింది. పంట నష్టం వివరాలను సేకరిస్తున్నట్టు మండల వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు తెలిపారు.

మొక్కజొన్న వర్షార్పణం

నల్లజర్ల: మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పొలాల్లోని వరి, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. తూర్పుచోడవరంలో ఆకుల దుర్గారావు అనే రైతుకు చెందిన మూడెకరాల్లోని మొక్కజొన్న పంట వర్షపు నీటిలో మునిగింది. భారీ చెట్లు విరిగి విద్యుత్తు లైన్లపై పడడంతో అనంతపల్లి పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలిగింది. మండలంలో ఇప్పటి వరకూ 1100 ఎకరాల్లో రబీ వరి కోతలు పూర్తయ్యాయి. చాలా గ్రామాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. కొన్ని గ్రామాలలో టార్పాలిన్లు కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు ఏఓ కమల్‌రాజ్ తెలిపారు. జగన్నాథపురం, ప్రకాశరావుపాలెం గ్రామాల రైతుల ధాన్యాన్ని అనంతపల్లి, నల్లజర్ల మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశామన్నారు.అవసరమైతే చాగల్లు, నిడదవోలు మిల్లులు కేటాయించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

చాగల్లు: చాగల్లుతో పాటు మండలంలోని బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, ఎస్. ముప్పవరం, మల్లవరం, మార్కొండపాడు, దారవరం తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. చిక్కాల, కలవలపల్లి తదితర ప్రాంతాల్లో మామిడి కాయలు నేల రాలాయి. ఇంకా రబీ పంటలు ఒబ్బిడి కాకముందే వర్షాలు, మబ్బులతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, ఊనగట్ల తదితర గ్రామాల్లో వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. మండలంలో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. దారవరం, మార్కొండపాడు, చాగల్లు గ్రామాల్లో స్తంభాలు నెలకొరిగాయి. బలంగా వీచిన గాలులకు ఊనగట్లలో ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. కలవలపల్లి, ఊనగట్ల, మార్కొండపాడు, నెలటూరు తదితర గ్రామాలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ అధికారులు మరమ్మతులు నిర్వహించి రాత్రి 7 గంటల తర్వాత సరఫరాను పునరుద్ధరించారు.

వైఎస్సార్ సీపీకే ప్రజా మద్దతు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- జగనన్నే మా భవిష్యత్తు ముగింపు సమావేశం


అనంతపల్లి నుంచి నల్లజర్లకు నిర్వహించిన బైక్ ర్యాలీ

నల్లజర్ల: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా సర్వే ద్వారా ప్రజా మద్దతు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ఉందని స్పష్టం అయ్యిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముగింపు సమావేశాన్ని శనివారం నల్లజర్లలో నిర్వహించారు. తొలుత అనంతపల్లి శివారు వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీగా ఎమ్మెల్యే సమావేశ స్థలానికి చేరుకున్నారు. వైఎస్సార్, బాబూజగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 1.05 ఇళ్లను సర్వే చేశామని, దాదాపు 95,700 ఇళ్లకు వెళ్ళి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారన్నారు. వారిలో 80 శాతం ప్రజలు వైస్ జగన్ పాలనకు అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు. అవినీతి, వివక్షకు తావు లేని పాలనకు ప్రజలు మద్దతు పలికారన్నారు. ఈ సర్వేలో అన్ని రాజకీయపార్టీల వారిని కలిశామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటికే అందుతున్నాయన్నారు. ఇదే విషయం మెగా సర్వేలో వెల్లడైందన్నారు. సర్వేలో విశేషంగా పాల్గొన్న వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, పార్టీ నాయకులు కారుమంచి రమేష్, బంక అప్పారావు, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, ఎంపీపీ కేవీకే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మా భవిష్యత్తు విజయవంతం

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు పూర్తి మద్దతు ఇస్తున్నారనడానికి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతం కావడమే నిదర్శమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహిచారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 1.45 లక్షల కుటుంబాలు మెగా పీపుల్స్ సర్వేలో పాల్గొనడపై ఈ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పెరలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ జనం మెచ్చిన సీఎంగా జగన్ పేరు తెచ్చుకున్నారన్నారు. నవరత్నాల హామీలను 100 శాతం నెరవేర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ పెరవలి మండల శాఖ అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, జేసీఎస్ పట్టణ, మండల కన్వీనర్లు చాన్‌ఫాషా కఠారు సిద్ధార్థరాజు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే..

- గడప గడపకూ మన ప్రభుత్వం
- హోం మంత్రి తానేటి వనిత
- అన్నదేవరపేటలో కొనసాగిన కార్యక్రమం


చిన్నారితో హోం మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి: స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని అన్నదేవరపేట-2లో శనివారం ఆమె రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ పథకాల గురించి ప్రజలను ఆమె అడిగి తెలుసుకున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. పలువురు మహిళలు మంత్రికి హరతులు ఇచ్చారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్ లెట్‌లను ప్రజలకు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని వెంట ఉన్న అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ ఎలిపే సుధారాణి, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణ దేవరాయులు, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, మండల శాఖ గౌరవాధ్యక్షుడు సిద్ధంశెట్టి కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు వి.స్వరాజ్యలక్ష్మి, నాయకులు పిట్టా శ్రీనివాస్, పి. నాని, ఎలిపే రాజు, మెట్టి గణేష్, నూతంగా సురేష్, ఎంపీడీవో ఎం. రాజశేఖర్, తహసీల్దార్ టి.రాధిక, ఆయా శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తులో కొవ్వూరుకు ఆరో స్థానం

హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: జగనన్నే మా భవిష్యత్తు పేరుతో చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో రాష్ట్రస్థాయిలో కొవ్వూరు నియోజకవర్గం ఆరో స్థానంలో నిలిచిందని హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. పట్టణంలో క్యాంపు కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. నియోజకవర్గంలో 92 శాతం కుటుంబాల్లో మెగా పీపుల్స్ సర్వే పూర్తి చేశామన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ సర్వే నిర్వహించిందన్నారు. నియోజవర్గంలోని మొత్తం 79,007 కుటుంబాలకు గాను 72,635 కుటుంబాలను సందర్శించామన్నారు. సర్వేలో 92 శాతం ప్రజలు ప్రభుత్వం పట్ల సానుకూలత వ్యక్తం చేశారన్నారు. రాష్ట్రంలోని 1.45 కోట్ల కుటుంబాలు ఈ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని చెప్పారు. రానున్న రోజుల్లో ఇదే విశ్వాసంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తారన్నారు. ప్రతిపక్ష టీడీపీ వాపును చూసి బలుపు అనుకుని భ్రమ పడుతోందన్నారు. నవ రత్నాల హామీలను నూరు శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని మంత్రి వనిత కోరారు. మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణపై డీపీవో అసంతృప్తి


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ జగదాంబ

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), మండల ప్రత్యేకాధికారి ఎస్.జగదాంబ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపైన, సచివాలయ పరిసరాల పరిశుభ్రతపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న లేఅవుట్లలో జియో ట్యాగింగ్ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె నిర్వహణ దారుణంగా ఉందంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్నందున కొత్త భవనాల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ధాన్యం కొనుగోళ్లపై జేసీతో చర్చిస్తా

ధాన్యం కొనుగోళ్లల్లో జరుగుతున్న జాప్యం, మిల్లుల వద్ద దిగుమతి చేయడంతో ఎదురవుతున్న ఇబ్బందులను జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ దృష్టికి తీసుకువెళతానని డీపీఓ జగదాంబ తెలిపారు. పలువురు లారీ యజమానులు ఆమెను కలిసి మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్‌లో జరుగుతున్న జాప్యం గురించి వివరించారు. 260 టన్నుల ధాన్యం లోడింగ్ చేసి లారీలపై ఉందని, మిల్లుల వద్ద 14 లారీలు అన్‌లోడింగ్ కావలసి ఉన్నట్టు చెప్పారు. గ్రామ సచివాలయాల వద్ద రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను స్పందనలో పరిష్కరించుకోవాలన్నారు. మే నెల 5వ తేదీన కొవ్వూరులో ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించినట్టు ఆమె తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యే ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామంలో బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ, తహసీల్దార్ ఎం. రామకృష్ణ, దుద్దుకూరు సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడేనికి చెందిన షేక్ హైదర్ (24) అనే యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. హైదర్ చేపల వ్యాపారం చేస్తూ నష్టపోయి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈనెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై అతడి తండ్రి రెహ్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

- చైర్మన్ భూపతి ఆదినారాయణ
- నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం


సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు


మాట్లాడుతున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు రూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు.ఆజెండాలో పొందుపరిచిన 12 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలోని ఎంవీ నగర్, ఎస్టీ కాలనీ, గాంధీనగర్, మూడు దాబాల వీధి, వైఎస్సార్ కాలనీతో పాటు పలు కాలనీల్లో సరైన అవుట్‌లెట్లు లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు డీపీఆర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని లింగంపల్లి, బసివిరెడ్డిపేట, చర్చిపేట డ్రైన్లలోని పూడికను తొలగించేందుకు 5.37 లక్షల మంజూరుకు కౌన్సిల్ ఆమోదించింది. మార్టేరు-ప్రక్కిలంక పరిధిలోని గణపతిసెంటర్, గణేష్‌చౌక్ వద్ద సిమెంట్ రోడ్లు నిర్మాణం ఎత్తుగా నిర్మించడంతో సెంట్రల్ డివైడర్లు ఎత్తు పెంచేందుకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.30 లక్షలు మంజూరు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, టీపీఓ కె.సుజాత, ఏఈ వెంకటేశ్వర్లు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆధునీకరించిన రన్నింగ్ ట్రాక్ ప్రారంభం


ఉన్నత పాఠశాలలో రన్నింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ మెండే వెంకట్రావు, బాలకృష్ణ

ఉండ్రాజవరం: విద్యార్థుల శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని తణుకు శ్రీసత్యనారాయణ స్పిన్నింగ్ మిల్ నిర్వహణాధికారి బాలకృష్ణ అన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల మైదానంలో ఆధునీకరించిన శనివారం రన్నింగ్ ట్రాక్‌ను సర్పంచ్ మెండే వెంకట్రావుతో కలసి బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ పాఠశాల క్రీడా ప్రాంగణంలో రన్నింగ్ ట్రాక్, కోర్టులకు మట్టితో ఆధునీకరించామన్నారు. అనంతరం ఈ పాఠశాల విద్యార్థుల కోసం డైనింగ్ హాల్‌లో స్పిన్నింగ్ మిల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ మెండే వెంకట్రావు, బాలకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరెళ్ల సోమేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్పిన్నింగ్ మిల్ అధికారులు ఉమా శంకర్, వైఎస్సార్ సీపీ నాయకుడు దోనేపూడి సుధాకర్, వార్డ్ మెంబర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.